క్లుప్తంగా

సీసీ రోడ్డు పనుల పరిశీలన

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ సఫ్దార్‌నగర్ డీ–బ్లాక్, ఎఫ్–బాక్‌లో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ సబిహా బేగం గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పనులను అనుకున్న సమయానికి పూర్తి చేసి అందించటం సంతోషంగా ఉందన్నారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో హమీద్, అస్లాం, బాబా, రఫిక్, తాయరు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అవసరం


నీటి నిల్వలను తనిఖీ చేస్తున్న అధికారి సంధ్య

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్‌లో దోమల నివారణలో భాగంగా ఎంటమాలజిస్టు సంధ్య గురువారం ఇంటింటికీ తిరిగి నీటి నిల్వలను తనిఖీ చేశారు. ఇంటి చుట్టు పక్కల నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ఆమె సూచించారు. ఇంటి లోపల నీటి సంపులు, డ్రమ్ములు, కుండలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తడి, పొడి చెత్త వేరుచేసి కాలనీకి వచ్చే ఆటోవారికి అందజేయాలని కోరారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే రోగాలు దరి చేరవన్నారు. ఎంటమాలజీ సూపర్‌వైజర్ డి.నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

దళితుల ఐక్యవేదిక నూతన కమిటీ ఎన్నిక

మూసాపేట: దళితుల ఐక్యవేదిక నూతన కమిటీని మెజార్టీ సభ్యులు గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడి మేకల మైకేల్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మేకల రమేష్, జనరల్ సెక్రటరీగా యడ్ల కవిత, సెక్రటరీగా సదా బాలాజియ్య, మీడియా సంతోష్, వైస్ ప్రెసిడెంట్‌లుగా పీఎల్ ప్రసాద్, యడ్ల అనిల్, శివ, జాయింట్ సెక్రటరీలుగా ఊరెళ్ల సుదర్శన్, పాతపల్లి శివ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బచ్చల వినోద్, ఉమెన్ వింగ్ అధ్యక్షురాలిగా కొల్లాబత్తుల లలిత, జనరల్ సెక్రటరీగా నాగలక్ష్మీలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని శివశక్తినగర్‌లో నూతనంగా చేపట్టిన సీసీ రోడ్డు పనులను మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు పరిశీలించారు. మిగిలిన ప్యాచ్‌వర్కు పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఎక్కువగా క్యూరింగ్ చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. అదేవిధంగా బాలాజీనగర్ డివిజన్ వార్డు కార్యాలయం నిర్మాణానికి జరుగుతున్న పనులను ఏఈ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి వెంకటేష్ చౌదరి, శానిటేషన ఎస్ఎఫ్ఏ చిరు, శారద తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్య


డీ–బ్లాక్‌లో పారుతున్న మురుగు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లోని వివేకానందనగర్‌లోని రోడ్డు నం.10 డీ–బ్లాక్‌లో నాలా నీరు రోడ్డుపై పారుతోంది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ఈ మురుగుతో దుర్వాసన, దుర్గంధం వెదజల్లటంతో పాటు దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మనూలో జాతీయ సదస్సు

రాయదుర్గం: 'ఖురాన్'పై మనూలో గురువారం కేరళ ఇంటర్నేషనల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ తఫ్సీర్ అల్‌ఖురాన్, ఉర్దూ విశ్వవిద్యాలయం అరబిక్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు ఖురాన్ యొక్క దక్కనీ, పర్షియన్ భాషల గురించి వివరించారు. ఖురాన్ ప్రాధాన్యతను వివరించారు.

'మనూ'ను సందర్శించిన సంగారెడ్డి విద్యార్థులు

రాయదుర్గం: మనూ యూనివర్సిటీని సంగారెడ్డిలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు తమ అధ్యయన పర్యటనలో భాగంగా గురువారం సందర్శించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హుమైరాసయీద్, అధ్యాపకులు రూహితరన్నుమ్ ఆధ్వర్యంలో విద్యార్థులు బాలికల హాస్టల్, సయ్యద్ హమీద్ లైబ్రరీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్, అండ్ జర్నలిజమ్, ఇన్‌స్ట్రక్షనల్ మీడియా సెంటర్, ఉర్దూ విభాగాలను పరిశీలించారు. ఉర్దూ యూనివర్శిటీలో విద్యా అవకాశాల గురించి అడిగి తెలుసుకున్నారు.

సమస్యల వలయంలో ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్


బోరబండ ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్


రైల్వేస్టేషన్ ఆవరణలో బస్సు షెల్టర్ పై కప్పును దొంగిలించిన దృశ్యం (సర్కిల్‌లో)..

మోతీనగర్: నగర జనాభాకు అనుగుణంగా ట్రాఫిక్ నియంత్రణ కోసం సుమారు రెండు దశాబ్దాల క్రితం ఎంఎంటీఎస్ రైళ్లను అందుబాటులోకి తీసుకువచ్చారు. అందులో భాగంగా పూర్వ మోతీనగర్ డివిజన్ ప్రస్తుతం అల్లాపూర్ డివిజన్ శివబస్తీ సమీపంలో బోరబండ ఎంఎంటీఎస్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. ప్రతి నిత్యం ఉదయం 4గంటలకు మొదలుకొని రాత్రి 11గంటల వరకు వేలాది మంది ఎంఎంటీఎస్ రైలులో ప్రయాణిస్తుంటారు. స్టేషన్‌లో మాత్రం కనీస వసతులు కల్పించకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

బస్సులు లేక ఆటోలో వెళ్లాల్సిన పరిస్థితి..

స్టేషన్‌కు సమీప బస్తీవాసుల సౌకర్యార్థం ఎంఎంటీఎస్ ప్రారంభ దశలో కూకట్‌పల్లి డిపో బస్సులను అనుసంధానంగా కొనసాగించారు. ఆ తర్వాత బస్సు సర్వీస్ ఆగిపోవడంతో ఆటోలపై ఆధారపడాల్సి వస్తోందని ప్రయాణికులు పేర్కొంటున్నారు. స్టేషన్ ఆవరణలో ప్రయాణికులు వేచి ఉండడటం కోసం బస్‌షెల్టర్ ఏర్పాటు చేశారు. కానీ వాటిని సైతం దొంగిలించారు.

ఎక్కడ చూసినా చెత్తాచెదారం, మురుగు...

పరిసర ప్రాంతాల్లోని కొందరు చెత్తాచెదారాన్ని తీసుకొచ్చి స్టేషన్ ఆవరణలో పడేస్తున్నారు. దీంతె ఈ ప్రాంతం దుర్గంధంగా మారింది. స్టేషన్ నుంచి దారి పొడుగునా వీధి లైట్లు సైతం లేవు. స్టేషన్ సమీపంలో ఎక్కువ ప్రదేశం ఖాళీ స్థలం ఉండటంతో పోకిరీల బెడద పెరిగిపోయిందని స్థానికులు పేర్కొంటున్నారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు ఉన్నా అవి ప్రయాణికులకు ఉపయోగపడవు.

జిల్లా రైళ్లను నిలపాలి...

బోరబండ ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ ఇరుపక్కల పలు బస్తీల్లో, కాలనీల్లో రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, తాండూర్, పరిగి, జనగామ, తొర్రూర్, మహబూబ్‌నగర్ జిల్లాల వాసులు ఎక్కువగా నివసిస్తుంటారు. వారందరూ పండుగలు, పర్వదినాల సందర్భంగా వారి ఊర్లకు వెళ్లాలంటే సికింద్రాబాద్, నాంపల్లి స్టేషన్‌లకు వెళ్లవలసిందే. అక్కడి నుంచి పై తెలిపిన రైళ్ల సౌకర్యం ఉంది. బోరబండ ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్‌లో వాటిని నిలిపినట్లయితే వారికి ఎంతో సౌకర్యంగా ఉంటుంది.


కంకర తేలిన స్టేషన్‌కు వెళ్లే రోడ్డు

వసతులు కల్పించాలి



రైల్వేస్టేషన్‌లో మౌళిక వసతులు కల్పించటంలో రైల్వే అధికారులు శ్రద్ధ చూపటం లేదు. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించాలి. బోరబండ రైల్వేస్టేషన్‌గా ఉన్న పేరును అల్లాపూర్ స్టేషన్‌గా మార్చాలని అధికారులకు గతంలో విన్నవించాను.

– సబిహా బేగం, అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్

రెండు ఆర్‌టీసీ బస్సుల ఢీ

ప్రయాణికులకు స్వల్పగాయాలు




భాగ్యనగర్‌కాలనీ: రెండు ఆర్‌టీసీ బస్సులు ఢీకొట్టుకున్న సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం... సుమిత్రానగర్‌లోని పిల్లర్ నం.794 వద్ద (ఏపీ 28 జెడ్ 4777) వెళుతున్న బస్సును వెనుక నుంచి వచ్చిన మరో ఆర్‌టీసీ బస్సు (ఏపీ 28జెడ్ 4235) ఢీకొని సడన్ బ్రేక్ వేయటంతో ముందున్న బస్సును ఢీకొట్టింది. దీంతో బస్సులోని ప్రయాణికులు ఒక్కసారిగా సీటు ముందున్న రాడ్లకు గుద్దుకున్నారు. ఈ ఘటనలో నలుగురికి స్వల్పగాయాలు కావటంతో రామ్‌దేవ్‌రావ్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. బస్సులో ప్రయాణిస్తున్న యల్లమ్మబండకు చెందిన అఫ్రా జాబిన్ పెదవికి గాయమై కుట్లు పడ్డాయి. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతోనే తనకు గాయమైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మరో ముగ్గురు చికిత్స అనంతరం ఇళ్లకు తిరిగి వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు.

రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించింది

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించిందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. గురువారం ప్రగతి యాత్రలో భాగంగా సూరారం డివిజన్‌లోని శ్రీరామ్‌నగర్, వేమననగర్, శ్రీకృష్ణనగర్, సోనియాగాంధీనగర్, కార్తీక్ నేచర్ స్పేస్ తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

◆ శ్రీరామ్‌నగర్ కాలనీలో రూ.3.49 కోట్లతో కొత్త కుంట నుంచి పెద్ద చెరువు వరకు చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ, రూ.48 లక్షలతో సీసీ రోడ్లు, రూ.1.50 కోట్లతో కొత్త కుంటకు డ్రైనేజీ మళ్లింపు పైపులైన్ పనులను పరిశీలించారు. సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఏఎల్ బషీరుద్దీన్, ఖాసిం బీ, సుధాకర్‌రెడ్డి, ముకుందరావు, సాజిద్, ప్రభుదాస్, కలీం, బస్తీల వాసులు పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నాం

జగద్గిరిగుట్ట: డివిజన్ అభివృద్ధికి తన శాయశక్తులా కృషి చేస్తున్నానని జగద్గిరిగుట్ట కార్పొరేటర్ జగన్ అన్నారు. డివిజన్ పరిధిలోని రాజీవ్‌గృహకల్పలో గురువారం ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న డ్రైనేజీ, రోడ్ల తదితర సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అదే విధంగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరలోనే మొదలు పెడతామని తెలిపారు. పలు కాలనీల్లో అంతర్గత రోడ్లను పూర్తి చేస్తున్నామన్నారు. స్థానిక నాయకులు సంతోష్, ప్రభాకర్, వనం శీను, ఆంజనేయులు, భాస్కర్, హనుమంతు, వెంకటస్వామి, భూపతిరెడ్డి, దుర్గయ్య పాల్గొన్నారు.


జగద్గిరిగుట్ట గృహకల్పలో సమస్యలను వింటున్న కార్పొరేటర్ జగన్

మార్చి 3 వరకు ప్రథమ పుష్కర బ్రహ్మోత్సవాలు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ గోదావరి హోమ్స్‌లోని శ్రీపద్మావతి, గోదా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రథమ పుష్కర బ్రహ్మోత్సవాలు ఈనెల 20వ తేదీ నుంచి మార్చి 3వ తేదీ వరకు జరుగనున్నాయని ఆలయ అధ్యక్షుడు తిరుమలరావు, ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డిలు ఓ ప్రకటనలో తెలియజేశారు. 24న శ్రీదాసాంజనేయస్వామి నూతన విగ్రహ యంత్ర ప్రతిష్ఠ, 25న శ్రీవిష్వక్సేన ఇష్టి, 26న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ శ్రీనివాస కల్యాణ మహోత్సం, సాయంత్రం గరుడ సేవ, 27న శ్రీవాసుదేవ ఇష్టి, శ్రీమహాలక్ష్మి అమ్మవారికి అభిషేకం, 28న శ్రీగోదావరి అమ్మవారికి అభిషేకం, మార్చి 1వ తేదీన అపమృత్యు దోష నివారణ, శ్రీనృసింహేష్టి, శ్రీవారికి లక్ష పుష్పార్చన, తులసీ దళార్చన, 2వ తేదీన శ్రీసుదర్శన ఇష్టి, మహాపూర్ణాహుతి, మహాకుంభ సంప్రోక్షణ, చక్రస్నానం, శ్రీపుష్పయాగం, ద్వాదశారాధన, ధ్వజారోహణం, 3వ తేదీన శ్రీవెంకటేశ్వరస్వామికి అభిషేకం, అష్టోత్తర శత ఘటాభిషేకం ఉంటుందన్నారు.

ఫైర్ సేఫ్టీ.. మాక్ డ్రిల్



భాగ్యనగర్ కాలనీ: వేసవిని దృష్టిలో ఉంచుకొని అగ్ని ప్రమాదాలు సంభవిస్తే ఎలా స్పందించాలనే విషయంపై ఫైర్‌సేఫ్టీ అధికారులు, కూకట్‌పల్లి పోలీసులు గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్ ఇండస్ట్రియల్ ప్రాంతంలో అధిక శాతం పరిశ్రమలు, కంపెనీలు ఉండటంతో తరచూ అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కంపెనీ యజమానులు తప్పని సరిగా ఫైర్‌సేఫ్టీ పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అగ్ని ప్రమాదం చోటు చేసుకుంటే ఏ విధంగా మంటలను అదుపులోకి తీసుకురావాలనే విషయంపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక సిబ్బంది, కూకట్‌పల్లి పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్ నర్సింగరావు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

సెంట్రల్ యూనివర్సిటీ పీజీ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ

రామచంద్రాపురం(పటాన్ చెరు): సెంట్రల్ యూనివర్సిటీ పీజీ ప్రవేశ పరీక్షకు అమృత సత్తయ్య కొల్లూరి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో 30 రోజులపాటు ఉచితంగా రెసిడెన్షియల్ కోచింగ్ ఇస్తున్నట్టు ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ బాలబోయిన సుదర్శన్, కోఆర్డినేటర్ పల్లికొండ మణికంఠలు తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. ఎంఏ పొలిటికల్ సైన్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులకు సంబంధించి కోచింగ్ ఉచితంగా ఇస్తామన్నారు. అమృత సత్తయ్య కొల్లూరి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఎంపికైన వారికి 30 రోజులు శిక్షణతో పాటు, స్టడీ మెటీరియల్, వసతి అన్నీ ఉచితంగానే అందిస్తామన్నారు. దరఖాస్తుకు చివరి తేదీ మార్చి3 అని తెలిపారు. మరిన్ని వివరాలకు తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని అమృత సత్తయ్య కొల్లూరు ఎడ్యుకేషన్ సొసైటీ సెంటర్‌ను సంప్రదించ వచ్చు.

ప్రభుత్వంతో భారత్ వెబ్–3 అసోసియేషన్ ఒప్పందం

సాక్షి, సిటీబ్యూరో: వెబ్ 3 సాంకేతిక కంపెనీలలో అగ్రగామి ప్రీమియర్ సంస్థ భారత్ వెబ్–3 అసోసియేషన్ (బీడబ్ల్యుఏ) తెలంగాణ ప్రభుత్వ సమాచార, సాంకేతిక ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ శాఖ (ఐటీఈసీడీ)తో ఒప్పందం చేసుకుంది. దీనిలో భాగంగా వెబ్ 3 సాంకేతిక నైపుణ్య ప్రయోజనాలను రాష్ట్ర ప్రభుత్వం అందుకోనుంది. ఈ ఒప్పంద ఖరారు కార్యక్రమం సందర్భంగా తెలంగాణా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం(ఐ అండ్ సీ) శాఖ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ (ఐటీ అండ్ సీ) శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ మాట్లాడుతూ ఈ ఒప్పందం భారతదేశంలో వెబ్ 3 రంగంలో ముఖ్యమైన ఎకోసిస్టమ్‌ను సాధించే తమ ప్రయత్నాలలో ప్రతిష్టాత్మకమైన మైలురాయిగా నిలుస్తుందన్నారు. ఈ భాగస్వామ్యం స్టార్టప్స్‌కు ఊపునిస్తుందని, అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న రంగంలో అసాధారణ అవకాశాలనూ అందించగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఎమర్జింగ్ టెక్నాలజీస్ డైరెక్టర్ రమాదేవి లంకా కాయిన్ డీసీఎక్స్ చీఫ్ పాలసీ ఆఫీసర్, డైరెక్టర్, భారత్ వెబ్ 3 అసోసియేషన్ కిరణ్ వివేకానంద పాల్గొన్నారు.

కార్డియాక్ క్యాత్‌ల్యాబ్ ప్రారంభం


క్యాత్‌ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీ రోడ్డు నం.4లోని రెమెడీ హాస్పిటల్‌లో నూతనంగా ఏర్పాటు చేసి కార్డియాక్ క్యాత్‌ల్యాబ్‌ను గురువారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బాలాజీనగర్ కార్పొరేటర్ శిరీష ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రెమెడీ హాస్పిటల్‌లో అనుభవజ్ఞులైన వైద్యులు, నర్సులు, టెక్నీషియన్లు ఉన్నారని అన్నారు. రోగులకు చికిత్సతో పాటు వారికి 24 గంటలు సేవలు అందించటానికి ఎప్పుడు సిద్ధంగా ఉంటున్నారని తెలిపారు. కార్డియాక్ సమస్యలతో బాధపడేవారికి క్యాత్‌ల్యాబ్ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించడాన్ని ఎమ్మెల్యే ప్రశంసించారు.

సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి


గచ్చిబౌలిలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న రాయదుర్గం సీఐ మహేష్

గచ్చిబౌలి: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, అవసరానికి మించి సెల్‌ఫోన్ వాడవద్దని రాయదుర్గం సీఐ మహేష్ విద్యార్థులకు సూచించారు. గురువారం గచ్చిబౌలి జడ్పీహెచ్‌ఎస్‌లో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్ వాడుతున్నప్పుడు వచ్చే ఓటీపీలను ఎట్టి పరిస్థితుల్లో ఓపెన్ చేయవద్దన్నారు. తెలియని యాప్‌లను వినియోగిస్తే సైబర్ మోసాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు సెల్‌ఫోన్‌లు ఇవ్వొద్దని సూచించారు. సైబర్ నేరాలు ఎలా జరుగుతున్నాయి.. వాటి వలలో చిక్కుంటె ఎలా నష్టపోతారో వివరించారు. డ్రగ్స్‌పై ఎలాంటి సమాచారం ఉన్నా డయల్ 100 కాల్ చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు. అంతే కాకుండా ట్రాఫిక్ నిబంధనలను విద్యార్థి దశ నుంచే తెలుసుకుంటే ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు ప్రమోద్ కుమార్, సతీష్, గచ్చిబౌలి జడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయులు ఇన్నారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్చి 11 నుంచి 19వ తేదీ వరకు శ్రీరామ జ్ఞానయజ్ఞం

పంజగుట్ట: లోక కల్యాణార్థం అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మార్చి 11 నుంచి 19వ తేదీ వరకు ఎన్‌టీఆర్ స్టేడియంలో శ్రీరామ మహా హోమం, జ్ఞానయజ్ఞం నిర్వహిస్తున్నట్టు ట్రస్ట్ చైర్మన్ రంగారావు తెలిపారు. కార్యక్రమ పోస్టర్‌ను గురువారం స్వామి స్థిత ప్రజ్ఞానంద సరస్వతి, వీహెచ్‌పీ ప్రతినిధి వెంకటేశ్వర్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ .. తెలంగాణలో ఇంత పెద్దెత్తున శ్రీ రామ కథా జ్ఞానయజ్ఞం జరగడం ఇదే మొదటిసారని, 108 యజ్ఞశాలలు ఏర్పాటు చేసి ఈ మహాయజ్ఞం నిర్వహిస్తామన్నారు. ప్రతీ రోజు ఉదయం 8 నుంచి సాయంత్రం 6 వరకు హోమయజ్ఞం నిర్వహిస్తామని, తర్వాత ప్రముఖులచే ప్రవచనాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో గురు చరణ్ తల్వార్, రామెంద్రనాథ్ భరద్వాజ్, ఎస్.శ్రీధర్ రెడ్డి, హరికృష్ణ శర్మ, తదితరులు పాల్గొన్నారు.



జీఓ.59 దరఖాస్తుదారులకు అండగా ఉంటాం


జీఓ.59 దరఖాస్తుదారులకు న్యాయం చేయాలని శ్రీశైలంగౌడ్‌ను కోరుతున్న నాయకులు

సుభాష్‌నగర్: జీఓ.59 దరఖాస్తుదారులకు బీజేపీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నేత కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. బుధవారం బీజేపీ సీనియర్ నాయకులు చెంది శ్రీనివాస్, పత్తి రఘుపతి గాజులరామారంలోని కార్యాలయంలో జీఓ.59 దరఖాస్తుదారులు పడుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ... జీఓ. 59 కింద దరఖాస్తు చేసుకున్న వారికి లక్షల్లో డిమాండ్ నోటీసులు రావడంతో బెంబేలెత్తుతున్నారని అన్నారు. నామమాత్రపు రుసుం తీసుకోవాల్సింది పోయి ప్రభుత్వం ఇలా దోపిడీకి పాల్పడటం అన్యాయమన్నారు. లక్షల్లో వచ్చిన డిమాండ్ నోటీసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే పోరాటాల ద్వారా ప్రభుత్వ మెడలు వంచుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజేష్ మిశ్రా, పృథ్వీరాజ్, శంకర్‌గౌడ్, రవినాయక్ తదితరులు ఉన్నారు.

లిపిడ్ జీవక్రియలో కాలేయానిదే ప్రధానపాత్ర

హెచ్‌సీయూ పరిశోధక బృందం వెల్లడి

రాయదుర్గం: లిపిడ్ జీవక్రియలో కాలేయం ప్రధాన పాత్ర పోషిస్తుందని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిశోధక బృందం వెల్లడించింది. ఈ వ్యాసం అంతర్జాతీయ నేచర్ కమ్యూనికేషన్స్‌లో ప్రచురించారు. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోకెమిస్ట్రీకి చెందిన ప్రొఫెసర్ నరేష్‌బాబు సేపూరి ఆధ్వర్యంలో బృందం అధ్యయనం చేసింది. ఈ బృందంలో డాక్టర్ నోబుల కుమార్ తలారి, డాక్టర్ ఉషోదయ మట్టం, నీరజ్‌కుమార్, అరుణ్‌కుమార్, డాక్టర్ తనూజా కృష్ణమూర్తి, డాక్టర్ కళ్యాణ్కర్ మహదేవ్ సహకారంతో ఈ అధ్యయనం చేశారు. ముఖ్యంగా ఫ్యాటీ లివర్ డిసీజ్ (ఎఫ్ఎల్‌డి) ముఖ్యంగా నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్(ఎన్ఏఎఫ్ఎల్‌డి) అనేది ప్రపంచ జనాభాలో 25 శాతం మందిని ప్రభావితం చేసే తీవ్రమైన ఆరోగ్య సమస్య అని పరిశోధనలో వెల్లడించారు. ఇది పొత్తి కడుపులో కొవ్వు పేరుకుపోవడం, ఇన్సులిన్ నిరోధకత, టైప్–2–డయాబెటిస్ మెల్లిటస్, హైపర్ టెన్షన్, డైస్లిపిడెమియా, కార్డియోవాస్కులర్ సమస్యలతో సహా జీవక్రియ అసాధారణతల ద్వారా వర్గీకరించబడుతుంది.

రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలి

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ


100 ఫీట్ రోడ్డు విస్తరణ పనులను పరిశీలించేందుకు వెళ్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఉషా ముళ్లపూడి కమాన్ నుంచి గాజులరామారం వరకు ఎల్లమ్మబండ ప్రధాన రహదారి 100 ఫీట్ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా గురువారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ... ఎల్లమ్మబండ రోడ్డులో నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని అన్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికై 100 ఫీట్ల రోడ్డు విస్తరణ చేపట్టామన్నారు.

◆ అందులో భాగంగా తీసుకోవాల్సిన చర్యలపై కార్పొరేటర్‌తో కలిసి ఉషాముళ్లపూడి కమాన్ నుంచి సిక్కుల బస్తీ వరకు పాదయాత్ర చేశారు. 100 ఫీట్ల రోడ్డుకు ఉన్న అడ్డంకులను తొలగిస్తూ తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ప్రణాళికను రూపొందించి రోడ్డు విస్తరణ పనులు వెంటనే చేపట్టాలని సూచించారు. త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

◆ రోడ్డు విస్తరణ పనులపై అధికారులకు పలు సూచనలు, సలహాలు అందించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. రోడ్డు మధ్యలో అడ్డంకిగా ఉన్న విద్యుత్ లక్ట్రికల్ స్థంభాలను దూరంగా ఏర్పాటు చేయాలన్నారు. 100 ఫీట్ రోడ్డు విస్తరణపై ఏమైనా సమస్య ఉత్పన్నమయితే తన దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

◆ అదే విధంగా ఎల్లమ్మచెరువు నుంచి హెచ్ఎంటీ శాతవాహనకు వెళ్లే రోడ్డుపై కోర్టుకు సరైన సమాచారం అందజేసి ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రోడ్డు వెంటనే వేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. ఎల్లమ్మ చెరువు సుందరీకరణలో భాగంగా మురుగు కలవకుండా డ్రైనేజీ పైపులైన్ ఔట్‌లెట్ సమస్యను పరిష్కరించాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని పేర్కొన్నారు. అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, కాశీనాథ్ యాదవ్, పాండుగౌడ్, పోశెట్టి గౌడ్, కిషన్, కైసర్ తదితరులు పాల్గొన్నారు.